క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం: ఏటా వర్షాకాలం వచ్చిందంటే మండలవాసులను దారి కష్టాలు వెంటాడుతున్నాయి. కోత్మీర్ నుంచి దహెగాం వరకు డబుల్ రోడ్డు మంజూరు కాగా కల్వర్టుల వద్ద మట్టి పోయడంతో కురిసిన వర్షాలకు బురదగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. దీంతో 'సాక్షి' లో దారి కష్టాలు తప్పవా..? శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. శనివారం కల్వర్టుల వద్ద మొరం పోశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డబుల్ రోడ్డు పూర్తయితే దారి కష్టాలు తీరుతాయని పలువురు పేర్కొంటున్నారు.

చెత్త తొలగింపు

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ పరిధి గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టుపై పేరుకుపోయిన చెత్తను శనివారం జేసీబీతో తొలగించారు. ప్రస్తుతం వానలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త వల్ల వర్షపునీరు నిలిచి కల్వర్టుపై నుంచి వరద నీరు పారుతోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. సమస్యను గుర్తించిన ఎంపీడీవో అంజద్‌పాషా స్పందించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

శాంతి భద్రతల పరిరక్షణకే తనిఖీలు

జైనూర్: వాహనదారులు సరైన పత్రాలతో పాటు లైసెన్సులు కలిగి ఉండాలని ఎస్సై రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుమురంభీం కూడలి వద్ద నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని, అధిక శబ్దం చేసే 50 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

గిరిజన మంత్రిగా సీతక్కకు బాధ్యతలు అప్పగించాలి

జైనూర్: గిరిజన స్థితిగతులు తెలిసిన మంత్రి సీతక్కకు గిరిజన శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించాలని మార్లవాయి గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్మేడి జుగ్నక దేవురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆదివాసీల స్థితిగతులపై అవగాహన లేని బీఆర్ఎస్ గిరిజన శాఖ మంత్రి ఆదివాసీల అభివృద్ధికి ఏం చేయలేదని ఆరోపించారు. ఆదివాసీలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మహగాం సార్మేడి ఆత్రం ఆనంద్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు స్వేచ్ఛ మృతి తీరని లోటు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు స్వేచ్ఛ మృతి రాష్ట్ర జర్నలిస్టు లోకానికి తీరని లోటని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్, ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆమె మరణంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నేతకాని సంఘం నాయకులు

రెబ్బెన: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని నేతకాని సంఘం నాయకులు కోరారు. మండలానికి చెందిన నేతకాని సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని గంగాపూర్ కమాన్ వద్ద గతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించాల్సి వచ్చిందన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, దాగం దామోదర్, దుర్గం భరద్వాజ్, రవి, జుమ్మిడి ఆనంద్, డోంగ్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- విరిగిపోయిన రెయిలింగ్‌లు
- ప్రమాదపుటంచున ప్రయాణం



కన్యాకాపరమేశ్వరి దేవాలయం సమీపంలో విరిగిపోయిన వంతెన దిమ్మె



ఇందిరా మార్కెట్ సమీపంలో కోతకు గురైన అప్రోచ్ వంతెన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కాలువలపై ఉన్న వంతెనల రెయిలింగ్‌లు, దిమ్మెలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో పట్టణ ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన నాలాలు రెండు ఉన్నాయి. పెట్రోల్‌పంప్ నుంచి నౌగాం బస్తీ మీదుగా ద్వారకానగర్, దోభీఘాట్ రైల్వే ట్రాక్ వరకు నాలా ప్రవహిస్తుంది. రెండోది డాడానగర్ నుంచి గుంటూరు కాలనీ, సర్‌సిల్క్, మీదుగా సర్దార్‌బస్తీని ఆనుకుని నాలా ప్రవహిస్తుంది. ఈ నాలాపై సుమారు 24 వంతెనలు ఉన్నాయి. ఈ వంతెనల మీదుగా టీచర్స్ కాలనీ, బాలాజీనగర్, ఆదర్శనగర్, శ్రీరాంనగర్, ద్వారకానగర్, కౌసర్‌నగర్, శ్రీకృష్ణనగర్, పాకీజానగర్, సర్‌సిల్క్, ఎఫ్‌కాలనీల ప్రజలు ప్రతీరోజు మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనల రెయిలింగ్ సిమెంట్ దిమ్మెలు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సమీపంలోని వంతెన రెయిలింగ్ విరిగిపోయింది. అంతేకాకుండా వంతెన ఎడమపక్కన కోతకు గురై ప్రమాదంగా మారింది. కన్యాకాపరమేశ్వరి దేవాలయం సమీపంలోని వంతెన సైడ్‌వాల్ పడిపోయి దిమ్మలే మిగిలాయి. ప్రయాణికులు అదుపుతప్పి నాలాలో పడకముందే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యులు ఎవరు..?

ప్రధాన నాలాలపై వంతెనల రెయిలింగ్‌లు, దిమ్మెలు విరిగిపోయి ఉండడంతో అదుపుతప్పి నాలాలో పడిపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నాలాలు ఉప్పొంగి ప్రవహిస్తే కుంగిపోయిన రెయిలింగ్‌కు ఆనుకుని ఉన్న మిగితా భాగం కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందంటున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే వారు లేరు



ప్రధాన నాలాపై వంతెనను 30 సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి దీని నిర్వహణ చూసిన వారు లేరు. వర్షాకాలంలో నాలా ఉప్పొంగుతుంది. ప్రతి నిత్యం ఈ వంతెన గుండా రాత్రి, పగలు నడుస్తూనే ఉంటారు. ఇప్పటికైనా వంతెన రెయిలింగ్ ఏర్పాటు చేయాలి.

– ఆవుల బాల్‌రాజు, కాగజ్‌నగర్

రెయిలింగ్‌లు ఊడిపోయాయి



కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో రెయిలింగ్‌లు, దిమ్మెలు ఊడిపోయాయి. మరో దిమ్మె విరిగిపోవడానికి సిద్ధంగా ఉంది. రాత్రి సమయంలో ఈ వంతెన మీదుగా ప్రయాణించాలంటే భయమేస్తుంది. పెద్ద వాహనాలు వచ్చినప్పుడు వంతెనపై నుంచి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించాలి.

– శ్రీనివాస్, కాగజ్‌నగర్

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

రెబ్బెన: సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ, టీబీజీకేఎస్ యూనియన్ల నాయకులు క్రిష్ణమాచారి, అంబాల ఓదెలు కోరారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లుగా మార్చి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, స్కీమ్ కార్మికులతో సహా కార్మికులందరికి జాతీయస్థాయిలో కనీస వేతనంగా నెలకు రూ.26వేలు నిర్ణయించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడంలో, కార్మిక చట్టాలను అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, శారద, బ్రాంచి కమిటీ సభ్యులు విజయలక్ష్మి, లక్ష్మి, మీరాబాయి, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

చదువురాని మహిళల వివరాలు సేకరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాల్

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో చదువురాని మహిళల వివరాలను సేకరించాలని ఎంఈవో వేణుగోపాల్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువురాని మహిళల వివరాలు సేకరించి వివరాల సర్వే ఫారంలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని, ఉల్లాస్ యాప్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. మండలంలో ఇప్పటివరకు 1500 మంది చదువురాని మహిళల వివరాలు సేకరించినట్లు ఐకేపీ ఏపీఎం దుర్గయ్య తెలిపారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌లు మోహన్‌రావు, రాష్ట్ర పర్యవేక్షకులు శివకృష్ణ, అధికారులు కటకం మధుకర్, నాగరాజు, ఏపీఎం దుర్గయ్య, ఎంఈవో వేణుగోపాల్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ యువత ఆత్మహత్యలకు పాల్పడుతూ కుటుంబాలకు శోకాన్ని మిగొల్చుద్దన్నారు. ప్రభుత్వం గ్రామాల్లోని మందుల దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న పారాక్విట్ గడ్డి మందును నిషేధించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు రాజశేఖర్ తల్లి లక్ష్మికి ఆర్థికసాయం కింద రూ.1లక్ష చెక్కును అందజేశారు.

దారి ఇవ్వాలని ఆందోళన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కెరమెరి: దారి ఇప్పించండి సారూ.. అంటూ మండలంలోని కెలిబి గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో అంజద్‌పాషాలను కోరారు. వారు మాట్లాడుతూ 15 కుటుంబాలు ప్రతీరోజు వెళ్లే దారిలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రహదారికి అడ్డంగా గోడ కట్టాడన్నారు. ఇదే విషయమై ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం తహసీల్దార్, ఎంపీడీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి గోడ కట్టిన స్థలాన్ని పరిశీలించారు. అయితే సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు ఆందోళన చేపట్టారు. 40 ఏళ్లగా ఇదే దారిలో నడుస్తున్నామని గతంలో 14 ఫీట్ల వరకు దారి ఉండగా ప్రస్తుతం 8 ఫీట్లు మాత్రమే మిగిలిందని వాపోయారు. జిల్లా కలెక్టరుకు నివేదిక సమర్పించి వారం రోజుల్లో న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

'పీఎం జుగా'పై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో శనివారం పీఎం జుగాపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి కల్పించాలని, ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజన కార్యక్రమంలో భాగంగా వీర్దండి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. పీఎం జుగా పథకంలో గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తారని తెలిపారు. అందరికీ విద్యా, రోడ్డు సౌకర్యం, పోషకాహారం అందించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ముక్తేశ్వర్, ఎస్ఈఆర్‌పీ మడావి పోచాని, కార్యదర్శి ప్రదీప్, సీసీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

వన దేవతలకు మొక్కులు



వనంలో వంటకాలు చేస్తున్న ఆదివాసీలు



రాజుల్‌పేన్‌కు పూజలు చేస్తున్న కటోడా

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ గ్రామానికి చెందిన ఆదివాసీలు వనదేవతలు రాజుల్‌పేన్, పేర్సపేన్, ఆకిపేన్ తదితర దేవతలకు పూజలు చేశారు. మండలంలోని గిరిజన గ్రామాల్లో అకాడి పండుగ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం మండలంలోని చిన్నసాకడ గ్రామానికి చెందిన ఆదివాసీలు అకాడిని ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో పూజలు అనంతరం అడవుల్లోకి వెళ్లి వనదేవతకు పూజలు చేశారు.

పారిశుద్ధ్యం లోపిస్తే ప్రమాదమే

- పంచాయతీల్లో నిధులు నిల్
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే మేలు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులు (ఫైల్)



ఖమాన గ్రామం ఎస్సీ కాలనీలో నిల్వ ఉన్న వర్షపు నీరు

వాంకిడి: వర్షాకాలంలో సీజనల్, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఈగలు, దోమలు, సూక్ష్మకీటకాలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతుంటారు. కలుషితమైన నీటి వల్ల సైతం అనారోగ్యానికి గురవుతుంటారు. ముందుగానే వ్యాధులపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ సంవత్సరం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు చేకూరేవి. కానీ గత ఏడాది నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో పంచాయతీ కార్యదర్శులకు పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారింది.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి అరొకర పనులు చేస్తున్నారు. దీంతో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా దర్శనమిస్తోంది. మురికి కాలువల నిర్వహణ లేకపోవడంతో వర్షాలకు డ్రెయినేజీ నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. వానాకాలంలో పరిసరాలను చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిలిచి, చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు పెరిగితే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రధానంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- వానాకాలం కొత్త నీరు వచ్చి చెరువులు, నదుల్లో కలుస్తుంది. దీంతో నీరు రంగు మారి కలుషితమవుతుంది. ఈ నీటితో స్నానాలు చేసిన, నీటిని తాగినా జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది.
- ఇంటి ఆవరణలో కొబ్బరి చిప్పలు, పనికి రాని టైర్లు పడేసి ఉంచడంతో వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తికి ఆవాసంలా మారుతాయి.
- కుళ్లిపోయిన ఆహారపదార్థాలు, పిచ్చి మొక్కలు పరిసరాల్లో ఉండటంతో దోమలతో పాటు ఈగలు వ్యాప్తి చెంది ఆరోగ్యానికి హాని కలుగజేస్తాయి.
- ఇంట్లో ఉన్న కూలర్లలోని నీటిని పారబోయాలి.
- ప్రతీరోజు డ్రమ్ములలోని నీటిని పారబోసి తాజాగా నింపుకోవాలి.
- సాయంత్రం 6గంటల లోపే ఇంటి తలుపులు మూసుకోవాలి. దీంతో దోమలు, ఈగలు లోపలికి వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- దోమల తెరలు వాడితే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం..



గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండేలా పంచాయతీ కార్యదర్శులతో ప్రతీ వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. పెండింగ్ బిల్లులు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణలో జాప్యం లేకుండా చూస్తున్నాం.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

పాఠశాల తనిఖీ

సిర్పూర్(టి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గంగాయిగూడను శనివారం ఎంఈవో వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించారు. విద్యార్థులకు అందాల్సిన యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ పంపిణీ, ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

కెరమెరి: సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఎస్సై ఎస్. మధుకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నగల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షల రూపాయల ఖరీదు చేసే నగలు దుకాణాల్లో ఉంటాయని, ఎప్పుడైన చోరీకి గురైతే దొంగతనం చేసిన వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మునీర్ అహ్మద్

కెరమెరి: మండల కేంద్రంలోని వివిధ వాడల్లో పేదలకు మంజూరైన నాలుగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజలకు నిలువ నీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. రూ.5 లక్షలను పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణానికి వినియోగించాలని తెలిపారు. కమిటీ సభ్యులు వండుగుల శ్రీనివాస్, వాజిద్ దేశ్‌ముఖ్, ఆదే శ్యాంరావు, కొట్రంగే తిరుపతి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్



ఎల్ములు రాజేందర్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా ఎల్ములు రాజేందర్‌ను నియమిస్తూ వరంగల్ రిజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన అంజయ్య ఈనెల 24న చెన్నూరుకు బదిలీ కాగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఎల్ములు రాజేందర్‌కు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.

న్యూస్ చానల్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

రెబ్బెన: ఒక న్యూస్ చానల్ కార్యాలయంపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విషయాలను బయటపెట్టిన చానల్ కార్యాలయంపై బీఆర్ఎస్ దాడి చేయడం సిగ్గుచేటన్నారు. మండల కార్యదర్శి నర్సయ్య, సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

బెజ్జూర్: మండలంలోని గొల్లబాయి చెరువులో ముంపునకు గురైన భూమిని నష్టపరిహారం పొందిన లబ్ధిదారులు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని శనివారం మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన యువకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంమోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెరువు శిఖం భూమి ఆక్రమించుకోవడంతో పశువులకు మేత, ఆయకట్టు భూముల రైతులకు నీరు అందక నష్టపోతున్నారన్నారు. ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకుని శిఖం భూములను రక్షించాలని కోరారు. గొల్లకురుమలు, రైతులు పాల్గొన్నారు.